క్లుప్తంగా

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం


ఇంద్రార్చితను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాల్లో సత్తాచాటిన పట్టణానికి చెందిన యువతి ఇంద్రార్చితను నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఇంద్రార్చిత ఇంటికి మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్, నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు వెళ్లి ఆమెకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పట్టుదలతో చదివి సివిల్స్‌లో ర్యాంకు సాధించడంపై ఆమెను నాయకులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్, శ్రీకాంత్‌గౌడ్, ప్రశాంత్, వాసిమ్, రఘు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

షాద్‌నగర్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థినులకు ఎంపీసీ, ఎంజెడ్సీ, బీజెడ్సీ, ఎంపీసీఎస్, బీఏ, బీకాం కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థినులు డిగ్రీలో అడ్మిషన్ పొందేందుకు నేరుగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ఈ సదవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9703441345, 8464006525 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలి

మొయినాబాద్‌రూరల్: పరిశోధనలు సమాజానికి ఉపయోగపడినప్పుడే వారికి గుర్తింపు లభిస్తుందని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్ పరిధిలోని యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో సాయిలక్ష్మి వల్లా పీహెచ్‌డీ పట్టా పొందారు. పీహెచ్‌డీలో డిజైన్ సింథసిస్ అండ్ పాసిబుల్ బయోలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ నోవెల్ 1.4 బెంజోకన్‌జంక్షన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనకు గాను ఆమెకు పీహెచ్‌డీ లభించింది. ప్రొఫెసర్ పులిగుల్ల శంకరయ్య పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. యూనివర్సిటీ ఛాన్సలర్ పురుషోత్తంరెడ్డి చేతుల మీదుగా ఆమెకు బుధవారం పట్టా అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొఫెసర్ డైరెక్టర్ సువర్ణదేవి, అడ్మినిస్ట్రేషన్ అధికారి సాత్వికారెడ్డి, వైస్ ఛాన్సలర్ శంకర్ లింగం, రిజిస్ట్రార్ రవీందర్, రీసెర్చ్ డీన్ ఆచార్య కిష్టఫర్, రాజేందర్‌రెడ్డి, జగదీశ్‌కుమార్, శంకరయ్య, కుమారస్వామి, పబ్లిక్ రిలేషన్ అధికారి గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మే డేను విజయవంతం చేయాలి


మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: మే 1 తేదీన నిర్వహించనున్న ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. చేవెళ్లలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

షాబాద్: తమ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి రబియా సుల్తానాను దైవాలగూడ గ్రామస్తులు కోరారు. బుధవారం మండల పరిధిలోని దైవాలగూడ గ్రామంలో నాగర్‌కుంట పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజ్, అంగన్‌వాడీ భవనం, రేషన్ సరుకులు అందేవిధంగా చూడాలని విన్నవించారు. రేషన్ సరుకుల కోసం కిలో మీటర్ దూరం నడుచుకుంటూ వెళ్తున్నామని, దీంతో ప్రజలకు ఇబ్బంది మారిందని ఆరోపించారు. రోడ్లు, మురుగు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు భాస్కర్, విజయ్, నర్సింలు, శ్రీనివాస్, మారుతి, బాలరాజ్, శివరాజ్, విఠల్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.


బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు


హాస్టల్ నుంచి తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

వేసవి సెలవులు వచ్చేశాయ్

- సొంతూళ్లకు పయనమైన హాస్టల్ విద్యార్థులు
- కిటకిటలాడిన షాద్‌నగర్ బస్టాండ్

షాద్‌నగర్: ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఇంటిబాట పట్టారు. ఈ నెల 24 నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో చివరిరోజు బుధవారం విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు సందడిగా మారాయి. చివరి బడి గంట మోగిందే తడవుగా విద్యార్థులు పుస్తకాలు చేతపట్టుకొని కేరింతలతో తరగతి గదుల్లో నుంచి బయటికి వచ్చారు.

ఆనందానికి అవధుల్లేవు

చాలా రోజుల తర్వాత ఇంటిక వెళ్తుండడంతో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. హాస్టల్ విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసిన వెంటనే బ్యాగులు సర్దుకొని సొంతూళ్లకు పయనమయ్యారు. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను దగ్గరుండి ఇంటికి తీసుకెళ్లారు.

బస్టాండ్ కిటకిట

సెలవులు కావడంతో విద్యార్థులు సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో షాద్‌నగర్ పట్టణంలో ఉన్న బస్టాండ్ విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కిటకిటలాడింది. బస్సులు ఎక్కేందుకు విద్యార్థులు పోటీపడ్డారు. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రంగా ఉన్నా బస్సుల్లో ప్రయాణించేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరిచారు.

బడికి టాటా.. ఇంటి బాట


హాస్టల్ నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థినులు

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు గురువారం నుంచి సెలవులను ప్రకటించింది. బుధవారం మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రోగ్రెస్ కార్డులను అందించారు. మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామంలో ఉన్న కేజీబీవీలో విద్యార్థినుల తల్లిదండ్రులతో కలిసి ఉదయం ఎస్ఓ గౌసియా సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థినిలను వారి తల్లిదండ్రులతో పంపించారు. పాఠశాలలో ఐదుగురు విద్యార్థినులకు తల్లిదండ్రులు లేరని వారందరినీ బంధువులు వచ్చి తీసుకెళ్లారు. కొత్తపేట గ్రామంలోని ప్రభుత్వ హాస్టల్‌లో నుంచి కూడా విద్యార్థులను వారి తలిదండ్రులు తీసుకెళ్లారు. వేసవి సెలవులను ప్రకటించడం పట్ల విద్యార్థులు అనందంతో పాఠశాలల నుంచి బయటికి వచ్చి గంతేశారు.


తల్లిదండ్రులు లేని విద్యార్థి వర్షను తీసుకెళ్తున్న బంధువు చెన్నయ్య

మేనమామ ఇంటికి విద్యార్థిని...

మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామ శివారులో ఉన్న కేజీబీవీలో చదువుతున్న విద్యార్థిని వర్ష ప్రస్తుతం 9 నుంచి పదో తరగతికి వెళ్తుంది. వర్ష చిన్నతనంలోనే తల్లి పాముకాటుకు గురై మృతి చెందింది. తండ్రి రెండేళ్ల క్రితం పసరికలు రావడంతో మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు లేక పోవడంతో మేనమామ వద్ద ఉంటుంది. వర్షది సంఘీగూడ అయినప్పటికీ మండల పరిధిలోని కోనాయపల్లిలో మేనమామ వద్ద చదువును కొనసాగిస్తోంది. కోనాయపల్లిలోనే సెలవులను గడిపేందుకు వెళ్తున్నట్టు విద్యార్థిని తెలిపింది.

ప్రోగ్రెస్‌లు చేతబట్టి..

షాబాద్: పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటి బాట పట్టారు. బుధవారం మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. దీంతో విద్యార్థులు రిపోర్టుల్లో వారికి వచ్చిన మార్కులను చూసి సంతోషపడ్డారు. తోటి స్నేహితులతో సరదాగా కాసేపు గడిపారు. మళ్లీ కలుద్దామంటూ వీడ్కోలు పలికారు. తమవారితో వారివారి గమ్యస్థానాలకు వెళ్లారు.


వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాలలో ప్రోగ్రెస్‌లతో విద్యార్థులు

ప్రైవేట్ వాహనాల్లో సొంతూళ్లకు..

చేవెళ్ల: విద్యాసంస్థలకు ఈ నెల 24 నుంచి జూన్ 11 వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు ఇళ్లకు ప్రయాణమయ్యారు. మండలంలోని బీసీ, ఎస్సీ, కస్తూర్బాగాంధీ వసతి గృహాలతో పాటు వికారాబాద్ జిల్లాకు చెందిన పలు గురుకుల పాఠశాలలు కూడా ఉండటంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఇళ్లకు బయలుదేరారు. బుధవారం పాఠశాలలకు చివరిరోజు కావటంతో తల్లిదండ్రులు విద్యార్థుల రిపోర్టు కార్డులు తీసుకొని ఇళ్లకు తీసుకెళ్లేందుకు వచ్చారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో చేవెళ్ల బస్‌స్టేషన్ కిక్కిరిసిపోయింది. సరిపడా బస్సులు సైతం లేకపోవటంతో ప్రైవేట్ వాహనాలు, ఆటోలు, జీపులలో సొంత గ్రామాలకు బయలుదేరి వెళ్లారు. తల్లిదండ్రులు, విద్యార్థులు లగేజీ బ్యాగులతో ఇళ్లకు వెళ్లటం కనిపించింది.


చేవెళ్లలో ఆటోలలో వెళ్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బడికి బైబై..


వెంకటాపూర్‌లో ప్రోగ్రెస్ రిపోర్ట్స్ తీసుకొని ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

మొయినాబాద్: పాఠశాలలకు వేసవి సెలవులు వచ్చేశాయి. బుధవారం చివరిరోజు స్కూళ్లకు వెళ్లిన విద్యార్థులు ప్రోగ్రెస్ రిపోర్టులు తీసుకొని ఆనందంగా ఇంటిబాట పట్టారు. మొయినాబాద్ మున్సిపాలిటీతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రోగ్రెస్ రిపోర్ట్స్ అందజేశారు. తమకు వచ్చిన మార్కులు చూసుకొని ఉత్సాహంతో ఎగిరి గంతేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థులు సైతం బుధవారం ఇంటిబాట పట్టారు. తల్లిదండ్రులు వచ్చి విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లారు.

టూరిస్టులపై దాడి పిరికిపంద చర్య

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్: టూరిస్టులపై ఉగ్రవాదులు దాడి చేయడం పిరికి పందల చర్య అని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడం బాధాకరమన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీసేందుకు, దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఉగ్రవాదులు కుట్రపన్నారన్నారు. పార్టీలకతీతంగా అందరూ ఉగ్రదాడిని ఖండించాలని కోరారు. నిరాయుధులైన సామాన్యులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన టూరిస్టులకు, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశంలో అశాంతిని నెలకొల్పేందుకు కుట్రలు చేయడం సరికాదన్నారు. దేశంలోని సమస్యాత్మక ప్రదేశాల్లో కేంద్రం కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని కోరారు.

ఉగ్రవాద సంస్థలను ఏరివేయాలి

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద సంస్థలను ఏరివేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాశ్మీర్‌లోని పహల్గాంలో ముష్కరులు పర్యాటకులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి హత్యమార్చడం బాధాకరమన్నారు. కాశ్మీరులోని ఉగ్రవాదులను ఏరివేసేందుకు కేంద్రం తక్షణం చర్యలు చేపట్టాలని కోరారు. దేశంలో మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. దేశంలో సమానత్వం, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తున్న నేపథ్యంలో ఇది జీర్ణించుకోలేక కొందరు ఉగ్రవాదులు కుట్రపన్నారని ఆరోపించారు. పర్యాటకులపై దాడులకు పాల్పడటం పిరికి పందల చర్య అన్నారు. ఎవరూ ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల్లో ఆత్మస్థైర్యం దెబ్బతీయలేరన్నారు. అందరు కలిసి కట్టుగా ఉండి ఐక్యతను చాటి ఉగ్రవాదాన్ని అంతమొందించాలన్నారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉగ్రవాదుల మారణ హోమం దారుణం

షాద్‌నగర్: జమ్మూ కాశ్మీర్‌లో హిందువులపై ఉగ్రవాదులు జరిపిన మారణ హోమం అత్యంత దారుణమని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) క్షేత్ర ప్రముఖ్ బండారి రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలను వదిలిపెట్టి హిందువులను మాత్రమే లక్ష్యంగా చేసుకొని ఉగ్రదాడులకు తెగబడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. దేశంలోని ప్రజలకు రక్షణ లేకుండా చేస్తున్న ఇలాంటి ఉగ్రవాదులను ప్రభుత్వం కూకటి వేళ్లతో అణిచివేయాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి దారుణాలు చోటుచేసుకోకుండా ఉండాలంటే హిందులంతా ఏకతాటిపైకి వచ్చి మతోన్మాదులను ఎదురించాలన్నారు. కాశ్మీర్‌లో మారణ హోమాన్ని సృష్టించిన ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉగ్రదాడి బాధాకరం

జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి బాధాకరమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఐదు రోజుల క్రితం పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్ చేసిన ప్రకటన చూస్తే భారతదేశాన్ని ఏవిధంగా అస్థిరపరచాలనే కుట్రకోణం కనబడుతుందని తెలిపారు. హిందువులు, ముస్లింలు కలిసి ఉండలేరని పాకిస్థాన్‌లో చేసిన వ్యాఖ్యలను కాశ్మీర్‌లో ఉగ్రదాడుల ద్వారా టెరరిస్టులు రుజువు చేస్తున్నారని వివరించారు. ఇలాంటి దాడులను దేశంలోని హిందువులందరూ ఐకమత్యంతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

పాకిస్థాన్ ఉగ్రవాదుల్లారా ఖబర్దార్

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక ప్రజలపై ఉగ్రదాడి జరిపిన పాకిస్థాన్ ఉగ్రవాదుల్లారా ఖబర్దార్ అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా పేర్కొన్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యతో కాశ్మీర్‌లో భయానక పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యాటకులను లక్ష్యంగా చేసుకొని సైనిక దుస్తుల్లో వచ్చిన దుండగులు ఈ దాడికి తెగబడ్డారన్నారు. కాశ్మీర్ ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ ప్రమేయం ఉందన్నారు. భారత్ శాంతిని కోరుకుంటుంటే పాకిస్థాన్ ఉగ్రదాడులను ప్రేరేపిస్తుందని ఆరోపించారు. ఇలాంటి దాడులను కేంద్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెబుతుందని పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కాశ్మీర్‌లో పర్యాటకులపై జరిపిన దాడి బాధాకరమని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదర్శ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న స్థానిక నాయకులు, కళాశాల అధ్యాపకులు

చేవెళ్ల: ఆదర్శ కళాశాలలో చదివే విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలకు దీటుగా రాణించడం అభినందనీయమని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి అన్నారు. చేవెళ్లలోని ఆదర్శ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కళాశాల అధ్యాపక బృందం అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా మెరిట్ విద్యార్థులకు పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి సన్మానించి ప్రోత్సాహకాలు అందజేశారు. ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించిన శృతిలయ, టాపర్లుగా నిలిచిన భార్గవి, వర్షిత, గాయత్రిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి, నాయకులు సమతారెడ్డి, మద్యల శ్రీనివాస్, మధుసుధన్‌రెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత

చేవెళ్ల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకుడు విఘ్నేశ్‌గౌడ్ ప్రోత్సాహకాలు అందజేశారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిన విద్యార్థికి 10వేలు, మెరిట్ సాధించిన 8 మంది విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి 5వేల రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహకాలను ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ఆర్డీఓ చంద్రకళ, ఎంఈఓ పురన్‌దాస్, తహసీల్దార్ కృష్ణయ్య, సీఐ భూపాల్‌శ్రీధర్ చేతుల మీదుగా విద్యార్థులకు ఆయన నగదు అందజేసి సన్మానించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు విఘ్నేశ్‌గౌడ్‌ను వారు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ జైపాల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, అంజనేయులు, నాయకులు సాయికుమార్‌గౌడ్, రాజిరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నగదు అందజేస్తున్న ఆర్డీఓ చంద్రకళ, ఎంఈఓ పురన్‌దాస్ తదితరులు

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి


వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, మున్సిపల్ కమిషనర్, నాయకులు


ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: చేవెళ్ల మున్సిపాలిటీతో పాటు పట్టణ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బుధవారం నూతనంగా కొనుగోలు చేసిన రోడ్లు శుభ్రం చేసే యంత్రం, డోజర్ వాహనాలను మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీలో రోడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ పరికరాలు ఉపయోగపడతాయన్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ పరిధిలో విలీనమైన గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసేందుకు సహకరిస్తానని, అధికారులు ఆ దిశగా పనిచేయాలని సూచించారు. వేసవిలో ఎక్కడ తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ నాయకులు జనార్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీఆర్, గోనే ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, నియోజకవర్గ నాయకుడు వసంతం, మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ అధికారులు రాఘవేందర్, రమేశ్, సిబ్బంది, నాయకులు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. జిల్లేడ్‌చౌదరిగూడ మండలంలోని చేగిరెడ్డి ఘనాపూర్‌లో బుధవారం కోట మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణానికి తనవంతుగా ఎమ్మెల్యే రూ.1లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కావలి రాజు, కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


పూజలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

పశుపోషణలో జాగ్రత్తలు తప్పనిసరి

పశువైద్యాధికారి అహ్మద్

మొయినాబాద్: పాడి పశువుల పోషణలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో బుధవారం గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని 238 పశువులకు టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాతావరణ మార్పులతో పశువులకు రోగాలు వస్తాయని, వాటి నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా టీకాలు ఇప్పించాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా వేస్తున్న టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.


పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యులు

ఐక్యతతో ఉగ్రవాదాన్ని నిర్మూలిద్దాం

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల: దేశాన్ని విడదీసే కుట్రలకు తలవంచేది లేదని జాతీయ ఐక్యతతో ఉగ్రవాదాన్ని నిర్మూలిద్దామని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా మున్సిపాలిటీలో బుధవారం రాత్రి బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని పాకిస్థాన్ డౌన్ డౌన్, టెరరిస్టులు నశించాలని అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే భారత ప్రభుత్వం పాకిస్థాన్‌కు, టెరరిస్టులకు తగిన బుద్ధి చెబుతుందన్నారు. ఎలాంటి సంబంధం లేని పర్యాటకులపై దాడి చేయటం హేయమైన చర్య అన్నారు. ఈ దాడికి తగిన మూల్యం చెల్లించిక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు పాండురంగారెడ్డి, డాక్టర్ వైభవ్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, ఇంద్రాసేనారెడ్డి, జయశంకర్, వెంకట్‌రాంరెడ్డి, నాగారాజు, అభిలాష్ శ్రీనివాస్, చంద్రశేఖర్, స్థానిక ప్రజలు ఉన్నారు.


చేవెళ్లలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కొత్తూరులో..

కొత్తూరు: కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని బుధవారం కొత్తూరు పట్టణంలో ప్రజలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన కూడలిలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, నాయకులు శ్రీనివాస్‌గౌడ్ వీరమోని దేవేందర్, ఈట గణేశ్, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.



షాద్‌నగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌లో భారీ ర్యాలీ

షాద్‌నగర్: కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ బుధవారం రాత్రి పట్టణంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో హిందూవాహినీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ తదితర సంఘాలతో పాటుగా బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.